ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 3 సెప్టెంబరు 2025



శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్



జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ఎలాంటి అల్లర్లు లేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. నవరాత్రోత్సవాల సందర్భంగా నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు.

ఆంధ్రజ్యోతి : జిల్లా కేంద్రంలో ఎన్ని వినాయక మండపాలు ఉన్నాయి?

డీసీపీ : జిల్లాలో 2400 మండపాల్లో వినాయకులను ఏర్పాటు చేశారు. వీరికి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను కూడా అందించింది.

ఆంధ్రజ్యోతి : నవరాత్రోత్సవాల సందర్భంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

డీసీపీ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం. ముఖ్యంగా ఉత్సవాల సమయంలో జియోటాగింగ్ ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నాం. ఉత్సవ కమిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించాం. వారికి రూట్‌మ్యాప్ కూడా అందించాం.

ఆంధ్రజ్యోతి : నిమజ్జనం కోసం పాయింట్లు ఏర్పాటు చేశారా?

డీసీపీ : నిమజ్జనం కోసం జిల్లా కేంద్రంలో ఇందారం గోదావరి బ్రిడ్జి, గూడెం బ్రిడ్జి, బెల్లంపల్లిలో చెరువు, చెన్నూర్‌లో చెరువు, జన్నారం, ఊట్నూర్ ప్రజలు గూడెం పాయింట్ వినియోగించుకోవాలి. నిమజ్జన కేంద్రాల వద్ద క్రేన్లను ఏర్పాటు చేశాం. తొందరపడకుండా వేగిరమైన ఆటంకాలు కలుగకుండా ప్రమాదాలు జరుగకుండా నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలి. కొందరు ఆకతాయిలు గతంలో గొడవపడ్డవారిని బైండోవర్ చేశాం. వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : నిమజ్జనానికి ఏమైనా సమయం కేటాయించారా?

డీసీపీ : నిమజ్జన కార్యక్రమాన్ని బెల్లంపల్లి, మందమర్రి ఈ నెల 5న నిర్వహించుకోవాలని, 6వ తేదీన జిల్లా కేంద్రంలో చేసుకోవాలని సూచించాం. సుమారు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశాం. మధ్యాహ్నం 3నుంచి 12లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలి.

- మంచిర్యాలక్రైం, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎల్లంపల్లికి వరద ఉధృతి

హాజీపూర్,సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట గ్రామ పరిధిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో 3,41,838 క్యుసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో 37గేట్లు తెరిచి 38,8134 క్యుసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లై కోసం 327క్యుసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 20.175టీఎంసీలకుగాను ప్రస్తుతం 18.1749టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంది.

మంచిర్యాల మీదుగా డెహ్రాడూన్‌కు ప్రత్యేక రైలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జోన్ పరిధి చర్లపల్లి నుంచి డెహ్రాడూన్ వరకు ప్రత్యేకరైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు నేటి నుంచి నవంబర్ 25వరకు ప్రతి మంగళవారం చర్లపల్లిలో ఉదయం 5గంటలకు బయలుదేరి కాజీపేటకు 6.30 గంటలకు, రామగుండం 7.45 గంటలకు, మంచిర్యాల 8 గంటలకు, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా డెహ్రాడూన్ చేరుతుందని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

లక్సెట్టిపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ సమ్మె సమయంలో అఖిల పక్ష నాయకులకు అక్రమంగా పెట్టించిన కేసులను ప్రభుత్వం కొట్టి వేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేసారు. మంగళవారం నాయకులు లక్సెట్టిపేట న్యాయస్థానంలో పేషీకి హాజరయ్యారు. అనంతరం పట్టణంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అఖిల పక్ష నాయకులపై అక్రమంగా ఆర్టీసీ సమ్మెతో పాటు చాలా కేసులు పెట్టించారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్తె సత్తయ్య, మాజీ వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, అఖిలపక్ష నాయకులు నైనాల గోవర్ధన్, తోట సత్తయ్య, రాందేని వెంకటేష్, బొప్పు సతీష్ పాల్గొన్నారు.

సాదాబైనామాలకు గ్రీన్ సిగ్నల్..



- హై కోర్టు ఉత్తర్వులతో చిగురిస్తున్న ఆశలు
- 2016 నుంచి క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం
- అసైన్డ్ భూముల పరిష్కారం కోసం లబ్ధిదారుల ఎదురు చూపు
- రెవెన్యూ సదస్సులో 30వేల పైచిలుకు దరఖాస్తులు
- ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలు

మంచిర్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామాలతో భూముల క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. హై కోర్టు ఉత్తర్వులతో ఈ అంశంపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు సాదాబైనామాలతో భూముల క్రమబద్ధీకరణకు పూనుకోగా, హై కోర్టు ఇచ్చిన స్టే కారణంగా ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. అయితే గతంలో ఇచ్చిన స్టే ను సవరిస్తూ ఇటీవల హై కోర్టు ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'ధరణి' భూ సమస్యలకు పరిష్కారం చూపకపోగా అనేక చిక్కుముడులను తెచ్చిపెట్టింది. ఆర్జీల పరిష్కారం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగిన స్పందనలేకుండా పోయింది. ఈ క్రమంలో కాంగ్రెస్ హయాంలో 'ధరణి' స్థానంలో ప్రవేశపెట్టిన 'భూ భారతి' ద్వారా సాదాబైనామాల సమస్యలను పరిష్కరించనున్నట్లు ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. భూ భారతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. గత ఏడాది నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో అధిక భాగం సాదాబైనామా, అసైన్డ్ భూములకు సంబంధించిన వికావడం గమనర్హం. జిల్లా వ్యాప్తంగా సాదాబైనామా పరిష్కారం కోసం 30,405 దరఖాస్తులు వచ్చాయి. బీఆర్ఎస్ హయాంలో సాదాబైనామాలతో భూముల క్రమబద్ధీకరణకు 2020 అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం హై కోర్టు ప్రభుత్వానికి మద్దతుగా తీర్పును ఇవ్వడంతో ఆ ప్రక్రియ ప్రారంభమైంది.

సమస్యల పరిష్కారం దిశగా....

ప్రభుత్వం ఆర్వోఆర్-2020-25 భూ భారతి చట్టాన్ని తీసుకవచ్చింది. ఇందులో భాగంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయగా బాధితులు దరఖాస్తులు చేసుకున్నారు. గత ప్రభుత్వం అంతకు ముందున్న రైతులకు భూ హక్కులు కల్పించే పట్టదారు పాసు పుస్తకాల చట్టం -1971ని రద్దు చేసి కొత్తగా పాసు పుస్తకాల చట్టం -2020 పేరిట ధరణిని తీసుకొచ్చింది. అయితే ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, కొత్త సమస్యలను తీసుకొచ్చింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కార్ గత ఏప్రిల్ 14న ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి అన్ని మండలాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించి 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎట్టకేలకు మొదలైన కార్యాచరణ...

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో సాదాబైనామా కూడ ఒకటి. గతంలో గ్రామాల్లో చాలా మంది రైతులు రెవెన్యూ స్టాంప్ పేపర్లు, తెల్లకాగితాలపై భూముల క్రయవిక్రయాలు జరిపేవారు. ఈ విధానంలో భూములపై హక్కు సంపూర్ణంగా లభించేది కాదు. ఈ విషయమై దృష్టిసారించిన గత ప్రభుత్వం సాదాబైనామాల సమస్యను పరిష్కరించేందుకు 2016లో జీవో నెంబర్ 153ను తీసుకొచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి... (తరువాయి 7లో)

రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్



చెన్నూరులో మాట్లాడుతున్న బాల్క సుమన్

చెన్నూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'అప్పుడే మంచిగ ఉండే' కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల పాలిట శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఎరువులు, విత్తనాలు, యూరియా కోసం రోడ్డెక్కడం, పండించిన పత్తి, వరి పంటలు అమ్ముకునేందుకు ఆందోళనలు చేయడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ వల్ల బ్యాక్ వాటర్‌తో పంటలు మునిగి తీవ్ర నష్టం జరిగిందన్న మంత్రి వివేక్‌వెంకటస్వామి ఇప్పుడు ఆయా బ్యారేజీల గేట్లు ఎత్తి ఉన్నా వరదలతో పంటలు నీటమునిగి పంటలు నష్టపోయారని, మరి దీన్నేమంటారని ఎద్దేవా చేశారు. కొత్త బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు నాయకులతో కలిసి యూరియా అందించడం లేదని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజారమేష్, మాజీ జడ్పీటీసీ తిరు పతి, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ వైస్ ఎంపీపీ బాపు రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



లక్ష్మీకాంతపూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు

దండేపల్లి సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో దెబ్బతిన్న పంట లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎకరానికి రూ. 40వేల నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. దండేపల్లి మండలం గుడిరేవు, లక్ష్మి కాంతపూర్ గ్రామ శివారులోని ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలిం చారు. భాధితులతో మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రవిందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌ఛైర్మన్ రేణి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై దృష్టి పెట్టాలి

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్

లక్సెట్టిపేట, సెప్టెంబర్, 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వ భూములపై దృష్టి సారించాలని ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా ఆపాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేసారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వాళ్లు చేసే కబ్జాలను అడ్డుకుని పేదలకు భూములు పంచాలని కోరారు. ముఖ్యంగా లక్సెట్టిపేట మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యా క్రాంతానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్‌బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ గౌడ్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'దసలి పట్టు రైతులపై దౌర్జన్యాలు ఆపాలి'

చెన్నూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దసలి పట్టు పరిశ్రమపై ఆధారపడిన రైతులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు ఆపాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తాపీ మేస్త్రీ కార్మికసంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజ కవర్గాల్లో సుమారు వెయ్యి మందికి పైగా ఆదివాసీలు, పేదలు తరాలుగా అడవిపై ఆధారపడి అడవిలోని మద్ది చెట్లపైన పట్టు పురుగులను పెంచి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా కృషి చేస్తున్నారన్నారు. వారికి కేటాయించిన కంపా ర్టుమెంట్లలోనే వారు పట్టు పురుగులను సాగు చేస్తున్నారని తెలిపారు. దసలి పట్టుకాయల ఉత్పత్తిలో మంచిర్యాల జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. వెంటనే అటవీ శాఖ దౌర్జన్యాలు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దసలి పట్టు పురు గుల రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో నాయకులు బాపు, శంకరయ్య, తిరుపతి, అంకక్క, రాజన్న, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదం.. అప్రమత్తతే కీలకం

- రైతులు, మూగజీవాలకు ముప్పు
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

6

కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులు

నస్పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పని చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు తెలంగాణ యునైటెడ్ మెడికల్,హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి అనితకు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమకు ఐదు నెలలుగా వేతనాలు అందక నానా ఇబ్బందులకు గురవున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. 104 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండపర్తి శ్రీనివాస్, ఎస్ శ్రీనివాస్, సత్యం, పురుషోత్తం, జయ, స్వప్న, శంకరమ్మ, శిరీష, మెషిన్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

- గూడెం గోదావరి తీరంలో ఏర్పాట్ల పరిశీలన



గూడెం గోదావరి నది వద్ద నిమజ్జన స్థలం పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, నాయకులు, అధికారులు

దండేపల్లి సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి సూచించారు. గూడెం గోదావరినది వద్ద మంగళవారం నిమజ్జన ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి ఎస్సై పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర్గకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అనంతరం గణేష్ ప్రతిమల నిమజ్జన ఏర్పాటు తీరుపై నాయకులతో పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఆర్పీ ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డంత్రిమూర్తి, ఎస్సై తహసీనోద్దీన్, ఎంపీవో రామ్‌ప్రసాద్ మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, మోహన్, నాయకులు వెంగల్‌రావు రాకేష్, లచ్చన్న, అశోక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్, కారోబార్ సత్యనారాయణ ఉన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం

- సన్నబియ్యం పథకానికి రూ. 12 వేల కోట్లు
- కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు నష్టం : మంత్రి వివేక్



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని రాష్ట్రకార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకట స్వామి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో చెన్నూరు నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, చేతికందిన పంటలు పూర్తిగా పాడైపోతున్నాయన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు తేడా చూడాలన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నాటకాలు ఆడుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని, వారు కేసీఆర్ వద్దకు వెళ్లి నిలదీయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిపోయిందన్నారు. ప్రాజెక్టు నీటితో సంబంధం లేకుండా 80 శాతం పంటలు పండుతున్నాయన్నారు. గతంలో తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని తన తండ్రి అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డికి చెప్పారని, అక్కడ ప్రాజెక్టు కడితే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనన్నారు. బీసీ రిజర్వేషన్‌లకు సంబంధించి ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకం కోసం రూ. 12 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. సన్నబియ్యం పథకంతో ప్రజలందరు సంతోషంగా ఉన్నారన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని తెలిపారు. కేసీఆర్ కూతురు కవితే కుంభకోణాల చిట్టా విప్పుతుందని, ఇది ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, అభినవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏడేళ్లగా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, నూతన విద్యా విధానన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిఖిల్, భరత్, రత్నవేణి, రాంచరణ్, హర్షవర్ధన్, ప్రదీప్, ప్రతీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరి వరద తాకిడికి దెబ్బతిన్న పంటలు



నస్పూర్ సమీపంలో పొలాల్లోకి చేరిన వరద నీరు

నస్పూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ సమీపంలోని గోదావరి నది తీరంతో పాటు తోళ్లవాగు వరద ప్రవాహం కారణంగా సాగు చేసిన పొలాల్లోకి నీరుచేరడంతో పంటలు దెబ్బ తిన్నాయి. చాలా వరకు మడుల్లో కొంత భాగంలో చెత్తచెదారం, ప్లాస్టిక్ సీసాలు, ఇసుక మేటలు, కర్రలు వచ్చి చేరాయి. నాటువేసిన కొన్ని రోజులకే వరద రావడంతో వరి మొక్కలు కొట్టుకు పోయాయి. అంతే కాకుండా పొలం గట్లు వరద తాకిడికి కోతకు గురయ్యాయి.

తీరప్రాంతంలో వరి పొలాల్లోకి వరద నీరు ప్రవేశించడంతో వరి పంటకు నష్టం కలిగించిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరదనీరు నారుమడుల్లో ఎక్కువ రోజులు ఉండడం మూలంగా మొక్కలు కుళ్లి పోయే అవకాశం ఉంటుందని, దీనివలన పంట దిగుబడికూడా తగ్గిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అధికారులు స్పందించి సర్వే చేసి నష్ట పరిహారం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

యూరియా కోసం
కొనసాగుతున్న ఆందోళన



ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో యూరియా కోసం రైతన్నల ఆందోళన కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్దకు చేరుకుని యూరియా కోసం నిరీక్షించారు. అక్కడ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ఐబీ చౌరస్తా) వద్దకు చేరుకుని రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. నెల రోజులుగా యూరియా కోసం నిరీక్షిస్తున్నా అధికారులు కానీ, పాలకులు కానీ పట్టించుకున్నపాపాన పోలేదని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. అదే సమయంలో యూరియా లోడ్‌తో గోదాంకు రెండు లారీలు రావడంతో ఒక్కసారిగా గోదాం వద్దకు రైతులు పరుగులు తీశారు. లారీల నుంచి యూరియా బస్తాలు తీసుకువెళ్లేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. యూరియాను పంపిణీ చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. సంబంధిత అధికారులు లేరని, పంపిణీ చేయలేమని చెప్పడంతో రైతులు వెనుదిరిగి వెళ్లి పోయారు. అధికారులు మాత్రం యూరియాను గురువారం పంపి ణీ చేస్తామని తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి



పెద్దవాగు నది తీరాన గణేశ్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా రహదారులపై గుంతలు పడిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడి వార్డులో మంగళవారం గల అంతర్గత రహదారులు, మురికి కాలువలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారులపై ఏర్పడిన గుంతలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదా రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని చెప్పారుఉ. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని, ప్రతి రోజు చెత్తను సేకరించాలని తెలిపారు. అనంతరం గొడవెల్లి వద్ద పెద్దవాగులో గణేశ్ నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. పట్టణంలోని వినాయకులను నిమజ్జనం కోసం ఇక్కడికే తీసుకు వస్తారని, భక్తులకు, వినాయక శోభాయాత్ర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి చదును చేయాలని చెప్పారు. నిమ్మన ప్రదేశం వద్ద వాహనాలు తిరిగే విధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిరంతరం వెలుతురు ఉండే విధంగా లైట్లు ఏర్పాటు చేయాలని, వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం క్రేన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనం రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గజానన్, తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జైనూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్ పరిసర ప్రాంతంలో పేకాట స్థావరంపై జైనూర్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడి చేసి 8,100 రుపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా జూదం ఆడుతుంటే ప్రజలు సమాచారం అందించాలని కోరారు. యువత పేకాటకు అలవాటు పడి కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకుని, కుటుంబాలను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు.



విద్యుత్ ప్రమాదం
అప్రమత్తతే కీలకం

● రైతులు, మూగజీవాలకు ముప్పు ● జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

వాంకిడి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు విద్యుత్తు ఉపకరణాలు వినియోగిస్తాం. కనీస జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. అసలే వర్షాకాలం ఇంటా.. బయట విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపడడం వంటివి జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారి నపడకుండా ఉంటారని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రమాదాలకు కారణాలు..

● గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యన, జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఉండి వాటికి చుట్టు కంచె లేకపోవడం.
● గ్రామాల్లో ఇళ్ల పైనుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం
● వ్యవసాయ బావుల పంట పొలాల్లో చేతికందే ఎత్తులో కర్రలపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండటం
● వర్షాకాలంలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటవల్ల, విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగడం, విరిగి పోవడం వంటివి జరిగి ప్రమాదాలకు కారణమవుతాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్న తీరు..

● ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ వైర్లు మార్చడం, చిన్నచిన్న మరమ్మతులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా అయి ఉండడం వల్ల విద్యత్ షాక్‌కు గురికావడం.
● వర్షాకాలంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరడగం, తీగలు తెగిపడడంతో ప్రమాదాలు జరుగుతాయి.
● వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి ఉండే కనెక్షన్ సరైన వైరింగ్ లేక పోవడంవల్ల ఏమరపాటుతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.
● స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటార్లకు వెళ్లే విద్యుత్ వైరు కనెక్షన్ పొదల్లో ఉండి గడ్డి కొస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతాయి.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

● విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను తాకకూడదు..
● తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లను, పరికరాలను ముట్టుకోవద్దు.
● పశువులను విద్యుత్ స్తంభాలకు, సమీపంలో కట్టి వేయొద్దు.
● పంటపొలాల వద్ద బావి, బోరు మోటార్లు వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దు.
● నాణ్యమైన స్టార్టర్ డబ్బాలు, సర్వీస్ వైరు వాడాలి.
● విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాలోకి, స్టార్టర్ డబ్బా నుంచి బోరు, బావి మోటర్లకు వెళ్లే విద్యుత్ కనెక్షన్‌కు సరైన వైరింగ్ ఉండేటట్లు చూసుకోవాలి.
● ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ఇంట్లోని టీవీ, కంప్యూటర్, ఫ్రిడ్జ్ వంటివి ఆఫ్ చేయాలి.



సిబ్బందికి సమాచారం ఇవ్వాలి..
శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ

ఎక్కడైనా విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే సొంతంగానే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. ప్రజలు సొంతంగా మరమ్మతులు చేయకూడదు.

అక్రమంగా మద్యం
తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్ మాట్లాడుతూ ముందస్తు అందిన సమాచారం మేరకు కాగజ్‌నగర్ నుంచి బస్టాండు ప్రాంతంలో తనిఖీలు చేయగా, ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి ఉంచి 1,050 సీసాల దేశీదారును పట్టుకున్నామని చెప్పారు. వీటి విలువ రూ.63వేల ఉంటుందని, ఈ దందాకు పాల్పడిన విశాల్, దినేష్ శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్స్ రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కాసిపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంటల్లో రైతులు పాటించే యాజమాన్య పద్ధతులపై మంగళవారం పల్లంగూడలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ పంటల్లో కలుపు నివారణ ప్రాధాన్యమైందని, ఏ పంటలో అయినా సకాలంలో కలుపు తీయడం వల్ల మొక్కలు బలంగా ఎదిగి పంటలు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. డాక్టర్ ప్రియ సుగంధి మాట్లాడుతూ బాలల్లో పోషకాహార లోపం దాని నివారణ కోసం తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ నానో యూరియా వాడకం,చీడ పీడల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు పంటల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీధర్ , రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి కుట్ర రాజకీయాలు



ఆసిఫాబాద్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌వి కుట్ర పూరిత రాజకీయాలు అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని చెప్పారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అద్భుతంగా పని చేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పుడు పలచటి పునాదులతో కూడిన ప్రాజెక్టుగా చిత్రీకరించడం వెనుక దుర్బుద్ధి ఉందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయాలకు వాడుకుని తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, పెంటు, వనజ, శంకరమ్మ, కలాం, రవీందర్, అజయ్, జీవన్, రవి, సందీప్, నిసార్, అశోక్, అశోక్, అహ్మద్, ఉమా రాణి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద మంగళవారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు ఆరోపణలు కేవలం రాజకీయ కుట్రలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, టౌన్ నాయకులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ ఆదేశాల మేరకు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు అస్లంబీన్ హసన్ మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంతో అన్ని విధాల విఫలమైందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఎస్సై కమలాకర్ వారితో ధర్నా విరమింపజేశా రు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మె ల్యే కోవ లక్ష్మి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్ లాలా, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మాజీ సర్పంచులు మడావి భీంరావ్, మాస్రాం లక్ష్మణ్, మాజీ డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆవుకు పూజలు నిర్వహిస్తున్న సభ్యులు

ఆవుకు అంత్యక్రియలు

బెల్లంపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్క న మంగళవారం మృతి చెందిన ఆవుకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హిందూ ఉత్సవ సమితి సభ్యులు హిందు సాంప్రదాయ ప ద్ధతిలో అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. మృతి చెందిన ఆవుకు స్నానం చేయించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆవును తీసుకెళ్లి పూడ్చేశారు. ఇలా ఆవుకు అంత్యక్రియలు నిర్వహించడంతో చూసిన ప్రజలు మానవత్వం చాటుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు నగేశ్, వ్యవస్థాపకులు కోడి రమేశ్, గోరక్ష ణ సమితి సభ్యులు శ్రీనివాస్, నర్సింహా మూర్తి పాల్గొన్నారు.

'కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం తగదు'

నెన్నెల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, మండల పార్టీ అధ్యక్షులు సాగర్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో, రైతులకు సరిపడ యూరియా సరఫరాలో విఫలమైన విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి కాళేశ్వరం అంశా న్ని తెరపైకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగతి రామ్ చందర్, ప్రతాప్‌రెడ్డి, ఎండీ ఇబ్రాహీం, రమేష్, తిరుపతి, తిరుపతి, మాజీ సర్పంచులు బాపు, మల్లేష్, శంకర్ పాల్గొన్నారు.

వేటగాళ్ల ఇళ్లల్లో డాగ్‌స్వాడ్ తనిఖీలు

నెన్నెల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుశ్నపల్లి అటవీ క్షేత్ర పరిధిలోని దుగ్నెపల్లి, కుశ్నపల్లి గ్రామాల్లో వన్యప్రాణుల వేటగాళ్ల, అటవీ నేరస్తుల ఇళ్లల్లో మంగళవారం ఫారెస్టు అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రత్యేక తర్ఫీదు పొందిన జాగిలం (హంటర్)తో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చెమట, దుస్తులు, అడుగు జాడల ఆధారంగా బెల్జియం జాతికి చెందిన హంటర్ అటవీ నేరాలకు పాల్పడిన వారిని పసిగట్టగలదని ఎఫ్ఆర్‌వో దయాకర్ చెప్పారు. రిజర్వు ఫారెస్టులో అక్రమంగా చెట్లు నరికిన వారు, వన్యప్రాణులను వేటాడిన వారు ఇక తప్పించుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు. వన్యప్రాణులకు హానీ తలపెట్టకూడదని సూచించారు. కార్యక్రమాల్లో సెక్షన్ ఆఫీసర్ రాందాస్, బీట్ ఆఫీసర్లు శంకర్, మహేష్, డాగ్‌స్వాడ్ సిబ్బంది అనీల్‌కుమార్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి
జీఎం ఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు పర్యావరణాన్ని కాపాడుకుంటూ రక్షణలో ముందంజలో ఉండాలని జీఎం ఎం విజయబాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడారు. గోలేటి సీహెచ్‌పీలో సేఫ్టీ ఫోర్టు నైట్ భాగంగా గోలేటి సీహెచ్‌పీకి ఎన్విరాన్మెంటల్ ఎకో ఫ్రెండ్లీలో మొదటి బహుమతి, స్టేఫిలో సీహెచ్‌పీలో మూడో బహుమతి వచ్చినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ రక్షణలో ముందంజలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కార్మికుల వేతనాలు
వెంటనే చెల్లించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి సింగరేణి సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయం ముందు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు రాష్ట్రీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్ మాట్లాడుతూ సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద వద్ద పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం సరైంది కాదన్నారు. అనంతరం పీఎం శ్యాం సుందర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బ్రహ్మనందం, శ్రీనివాస్, భూమయ్య, రాములు , సుశీల తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన
జీఎంకు సన్మానం

రెబ్బెన, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో పదవీ విరమణ పొందిన జీఎం (సివిల్) శ్రీనివాసరావుకు మంగళవారం సన్మానం చేశారు. జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్‌రావు సింగరేణికి అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పీవో మచ్చగిరి నరేందర్, ఎస్ ఓ టు జీఎం కె రాజమల్లు సిబ్బంది పాల్గొన్నారు.

రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. అన్ని ఏరియాల జీఎంలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రస్తుత బొగ్గు రంగంలో పోటీని ఎదుర్కోవడానికి వీలుగా ప్రతి ఉద్యోగి బొగ్గు వ్యయం తగ్గింపు... ఉత్పత్తి పెంపు అనే లక్ష్యాన్ని నిర్ధేశించుకొని పనిచేయాలన్నారు. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్పత్తికి విఘా తం కలుగుతోందన్నారు. దానిని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రస్తుత ఉత్పత్తి లక్ష్యం రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అలాగే ఓబీ 12.5 లక్షల క్యూబిక్ మీటర్లు తొలగించాలన్నారు. 2.10 లక్షల టన్నుల రవాణా జరగాలని చెప్పారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు ఎస్టేట్స్ విభాగం ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఏడాది ప్రారంభించనున్న మూడు గనులతో సింగరేణికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుం దన్నారు. నూతన గనుల అనుమతులు త్వరగా పొందాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమా వేశంలో డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వ ర్లు, గౌతమ్ పొట్రు, ఎం తిరుమలరావు, ఈడీ (కోల్‌మూమెంట్) బి వెంకన్న, జీఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం(సీపీపీ) మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

మాకు వెంటనే ఉద్యోగాలు ఇప్పించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమకు వెంటనే ఉద్యోగాలు ఇప్పించాలని సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ కేసుల బాధితులు డిమాండ్ చేశారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తమ దండ్రుల కాలంలో జరిగిన పొరపాటు కారణంగా సింగరేణిలో మారుపేర్లు నమోదయ్యాయని అన్నారు. ఈ కారణంగా వారి వారసులమైన మాకు ఉద్యోగాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదన్నారు. అలాగే విజిలెన్స్ విచారణ పేరిట ఏళ్లకు ఏళ్లు నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఉన్న తమకు సింగరేణి యాజమాన్యం మొండిచేయి చూపిందన్నారు. ఈ కారణంగా ఎలాంటి ఉపాధి లేక తమ కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి సంస్థకు ఆదే శాలు ఇచ్చారన్నారు. కానీ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు ఫైల్ పంపిం చామని, క్లియరెన్స్ తరువాత కలవాలని యాజమాన్యం కోరీల్రు పెడు తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ ప్రత్యేక చొరవ తీసుకొని యాజమాన్యంతో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. తమకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. సమావేశంలో దబ్బెట అంజయ్య, రాజయ్య, బీరయ్య, ప్రవీణ్, రవి కుమార్, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల
పరిరక్షణకు పాటుపడాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల పరిరక్ష ణకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సూచించారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు పేరం రమేశ్‌కు ఈ అండ్ ఎం టెక్నీ కల్, సూపర్‌వైజర్ స్టాఫ్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. యూనియన్ విలువలను కాపాడుతూ, కార్మికుల సంక్షేమం, హక్కుల పరి రక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలపి సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పల డిమాండ్ల సాధనకు ఈ నెల 12 నిర్వహించే చలో ప్రజాభవన్ పోస్టర్లను శ్రీరాంపూర్ ఓసీపీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్ట్ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని అన్నారు. కనీస వేతనాల జీఓలు గెజిట్ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కోటి 20 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు నష్టపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 12న చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు గట్టు మహేందర్, బెల్ట్ క్లీనింగ్, రోడ్డు క్లీనింగ్ కన్వేయన్స్ డ్రైవర్లు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

విభిన్నరూపాయ ఏకదంతాయ

జిల్లా వ్యాప్తంగా వినాయకుడి నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వాడ వాడలా కొలువుదీరిన గణనాథులు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నారు. వినాయక మండపాల్లో కుంకుమ పూజలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేసి మండపాలను అందంగా అలంకరించారు..



దండేపల్లిలో వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు

మంచిర్యాలలో కూరగాయలు, పండ్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు

మంచిర్యాల లక్ష్మీ బాలాజీ నగర్‌లో

మందమర్రిలో వారాహి గణపతి

నస్పూర్‌లోని ఆర్‌కే5 కాలనీలో..

పాత మంచిర్యాల విశ్వకర్మ మందిరంలో..

పాత మంచిర్యాల సబ్ స్టేషన్ రోడ్డులో..

బెల్లంపల్లిలో..

కాసిపేటలో..

తాండూర్‌లో బాలరాముడి ఆకారంలో..చెన్నూర్‌లో మట్టి వినాయకుడు..హాజీపూర్ మండలం నంనూర్, జైపూర్‌లో కొలువుదీరిన గణనాథులు

సంక్షిప్త సమాచారం

భీమారం : మండలంలోని ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేసినట్లు ఎంపీవో సతీష్‌రెడ్డి తెలిపారు. 11 గ్రామపంచాయతీల్లో 13093 మంది ఓటర్లు ఉన్నారని, వీరి కోసం 94 ఓలింగ్ కేంద్రాలను సైతం గుర్తించామన్నారు.

మందమర్రిరూరల్: మండలం లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇటీవల మందమర్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో అభిగ్న వెండి పతకం, అనన్య కాంస్య పతకం సాధించారాన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ సారా తస్నీం అభినందించారు. కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన జయతికి రూ. 2 లక్షల బీమా చెక్కును మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ ఇందల్ అందజేశారు.

తాండూర్ : బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌ను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

జన్నారం: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రోగులకు పండ్లుపంపిణీ చేసి అనంతరం కేక్ కట్ చేశారు. పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్, రవి, పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణం ఎన్టీఆర్ నగర్ కాలనీలో వరద బాధితులకు అఖిలభారత అయ్యప్ప ప్రచార సభ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్ నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వరద ప్రభా వం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారనే సమాచారంతో పేదల కోసం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు.

కాకా కుటుంబంతోనే అభివృద్ధి

జైపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాకా కుటుంబంతోనే చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి ముందుకు సాగుతుందని కాంగ్రెస్ జిల్లా ప్ర ధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వందేభారత్ రైలు ఆగేలా ఎంపీ వంశీకృష్ణ పట్టుదలతో కృషి చే శారన్నారు. మంత్రి వివేక్‌వెంకటస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు సత్యనా రాయణరెడ్డి, రాజబాబురెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆవిడపు గణేష్, పాపిరెడ్డి లింగారెడ్డి, నర్సయ్య, రాజన్న, మంతెన లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



కమిషనర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గణనాథుని నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజలింగు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యానగర్ వరసిద్ధి వినాయక మండపంలో గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కమిషనర్‌ను సన్మానించారు. సభ్యులు సొత్కు సుదర్శన్, బింగి రాజన్న, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

టీపీసీసీ మండల కోఆర్డినేటర్‌గా ఆడెపు రమేశ్



హాజీపూర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ హాజీపూర్ మండల కోఆర్డినేటర్‌గా నంనూర్ గ్రామానికి చెందిన ఆడెపు రమేశ్ నియమితుల లైనట్లు డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్పజెప్పిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, సురేఖలకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ ఒక్కరు నేత్రదానం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్,లయన్స్‌క్లబ్ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు నేత్ర దానం చేసి ఇతరులకు చూపు ప్రసాదించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రరెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రొఫెసర్ గీతాంజలి పేర్కొన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 40వ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఎంవో శ్రీమన్నారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు సురేందర్, వినయ్‌కుమార్, డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : జీఎం కార్యాలయంలోని ఏరియా ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన జి. ప్రసాదరావును ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ప్రసాద రావు 36 ఏళ్ల పాటు సంస్థకు సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, సీనియర్ పీవో కాంతారావు, పిట్ కార్యదర్శి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు

బీఆర్ఎస్ నాయకుల ఆందోళనలు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మంచిర్యాల, నస్పూర్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, అక్కూరి సుబ్బన్న, సీనియర్ నాయకుడు వంగ తిరుపతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు యూరియా ఇవ్వడం కూడ సాధ్యకావడం లేదన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు అరుణ్, శ్రావణ్, గోపి, ఎం.శ్రావణ్ , అలీ పాల్గొన్నారు.

వేమనపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను వ్యతిరేకిస్తూ మంగళవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేసి రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్, వెంకటేష్, మధు, మొండి, సంతోష్, బాపు, ప్రదీప్, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు జనార్ధన్, భరత్‌కుమార్, మున్వర్‌అలీ, వినయ్, ఫజల్‌ఖాన్, గంగాధర్, నర్సాగౌడ్, పాల్గొన్నారు.

కాసిపేట : మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ మంగళవారం కొండాపూర్ యాప వద్ద బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాసుదేవ్, నాయకులు అజ్మీర తిరుపతి నాయక్, శంకర్, శ్యామ్, అజ్మీర రాజేష్, గజానంద్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూర్ : కాళేశ్వరం ప్రాజెక్టు సీబీఐ విచారణకు అప్పగించడాన్ని నిరసిస్తూ, ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తుండడాన్ని ఖండిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు తాండూర్ ఐబీ కేంద్రంలో ఆందోళన చేపట్టారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జిల్లెల్ల మహేష్‌గౌడ్, నాయకులు ఆకుతోట రాజన్న, అశోక్, గణేష్, రామన్న, దేవాజీ, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళులు



బెల్లంపల్లిలో వైయస్ చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు సంక్షేమం, రాష్ట్రానికి అభివృద్ధి చేసిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిలుముల శంకర్, నాయకులు రొడ్డ శారద, శ్రీనివాస్, బండి రాము, ఆనంద్ పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, నాయకులు వెంగల్‌రావు, సతీష్, నవీన్, రవి, లక్ష్మీనారాయణ, కిషన్‌నాయక్, సత్తయ్య, లింగన్న. సత్తన్న పాల్గొన్నారు.

సాదాబైనామాలకు గ్రీన్ సిగ్నల్..

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులు స్వీకరించి చట్టబద్దత కల్పించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబర్ 12న కూడ జీవో నెంబర్ 112 ను జారీ చేసింది. సాదాబైనామాల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా వేసింది. అయినా సమస్యలకు పరిష్కారం లభించ లేదు. ఆ సమస్య పరిష్కారం కాకుండానే 29అక్టోబర్ 2020లో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల చట్టాన్ని తెచ్చింది. ఎన్నిసార్లు జీవోలు తెచ్చినా.. .పరిష్కారం చూప కపోవడంతో విమర్శలు మూటగట్టుకుంది. గత ప్రభుత్వం కేవలం జీవోల జారీతోనే సరిపెట్టిందని, సాదా బైనామాలపై తహ సీల్దార్లకు అధికారాలు ఇచ్చినప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు సరైన మార్గదర్శకాలను విడుదల చేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రారంభించింది. సాదాబైనామాలతోపాటు అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి కూడా దరఖాస్తులు వచ్చాయి. ముందుకు సాగు సమయంలో సాదా బైనా మాల అంశం హైకోర్టుకు వెళ్లడం, ఈ అంశంపై స్టే విధించింది. ప్రభుత్వం కూడా ఎటూ తేల్చుకోలేని సంకట స్థితిలోకి వెళ్లింది. వాస్తవానికి ప్రభుత్వం భూభారతి చట్టంలో సాదాబైనామాల సమస్యను చేర్చినందున హైకోర్టు తీర్పు కూడా అనుకూలంగా వస్తుందనే అభిప్రాయాలను దరఖాస్తు దారులు అప్పట్లోనే వ్యక్తపరిచారు. ప్రస్తుతం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలు వడినందున ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి సమస్యలకు పరిష్కారం చూపేందుకు సన్నద్ధం అవుతోంది. ఇందులో భాగంగా 2020 వరకు ఉన్న సాదాబైనామాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన 30,405 దరఖాస్తుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 24,800 అప్లికేషన్లను తిరస్కరించగా, మిగిలిన 5572 మందికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు 3143 విచారణ జరుపగా, మరో 2532 దరఖాస్తుల విచారణ జరగాల్సి ఉంది.

ఎరువుల కోసం రైతుల పడిగాపులు

జన్నారం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సరైన సమయానికి యూరియా అందకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో రైతులు తెల్లవారు జాము నుంచే యూరియా బస్తాల కోసం పడిగాపులు కాసారు. పొన్కల్‌తో పాటు తపాల్‌పూర్ యూరియా బస్తాలకు సిగ్నల్ లేక ఓటీపీలు సరిగ్గా రాక 6 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వచ్చిన 266 బస్తాలకు గాను కేవలం 123 బస్తాలు మాత్రమే ఇచ్చే పరిస్థితి నెలకొంది.

దండేపల్లి : యూరియా కోసం అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటి విక్రయ కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలుసుకుంటున్న రైతులు పరుగులు పెడుతూ క్యూలైన్‌లో నిలబడి యూరియా తీసుకెళ్లారు.

ఓటర్ల తుదిజాబితా ప్రదర్శన

హాజీపూర్,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లోని ఎంపీపీ కార్యాలయాల్లో ఫొటోలతో కూడిన ఓటరు తుది జాబితాలను మంగళవారం ప్రదర్శించారు. జిల్లా మండల స్థాయిల్లో అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు, వార్డు మార్పులు తదితర వాటిపై వచ్చిన 515 అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షణలో పరిష్కరించారు. తుదిజాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలను ప్రారంభం చేసి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఆయా జీపీల్లో ప్రదర్శనగా ఉంచారు.

కాసిపేట : రెండవ సాధారణ ఎన్నికలు 2025 సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. మండలంలో 22 గ్రామపంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాతో పాటు పోలింగ్‌కేంద్రాల లిస్టును విడుదల చేశారు. పూర్తి వివరాలను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని నోటీసు బోర్డుపై అంటించినట్లు తెలిపారు. ఎంపీవో సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు లక్ష్మీనారా యణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

గణపతికి పూజలు చేసిన మంత్రి

చెన్నూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొలువుదీరిన గణపతికి మంగళవారం మంత్రి వివేక్‌వెంకటస్వామి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలందరు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం



అన్నారంలో పంటలను పరిశీలిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాళేశ్వరం బ్యాక్ వ్యాటర్‌తో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలో నీటిలో మునిగిన పంట పొలాలను మంత్రి పరిశీలించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్లనే పంట పొలాలు నీటిలో మునుగుతున్నాయన్నారు. రైతులు నిరాశకు గురి కావద్దన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట కలెక్టర్ కుమార్ దీపక్, రైతులు ఉన్నారు.

నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందిస్తాం

కోటపల్లి : వర్షాలతో నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం కోటపల్లి మండలంలోని అన్నారం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంట నష్టంపై తక్షణ నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్‌కు సూచించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ

జన్నారం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలం ఆర్య వైశ్య సంఘం, వర్తక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాగణపతి వద్ద మండల హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు గుండి సత్తయ్య శర్మ గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జక్కు భూమేశ్, వర్తక సంఘం అధ్యక్షులు వొజ్జల వామన్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అత్తె రఘు, ప్రధాన కార్యదర్శి ఒడిపెల్లి రాజేశ్, హిందూ వాహిని జిల్లా సంయోజక్ దండవేని శ్రీధర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలోని గాంధీచౌక్‌లో శ్రీలక్ష్మి గణపతి గణేష్ మండపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం నైవేద్యాలను సమర్పించారు. కమిటీ సభ్యులు బాపన్న, తోట సత్తయ్య, సత్యనారాయణ, అన్నం శంకరయ్య, చంద్రయ్య, బూమన్న, కల్వల సుదర్శన్, రాజ్‌కుమార్‌పాల్గొన్నారు.

దండేపల్లి: వినాయక నవరాత్రుల ఉత్సావాల్లో భాగంగా మంగళవారం దండేపల్లి మండలంలోని గణేష్ మండల వద్ద విఘ్నేశ్వరుడికి భక్తుల ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లిచుకున్నారు. మహిళ భక్తులు కుంకుమ పూజలు చేశారు. దండేపల్లిలో సిద్ది వినాయక మండపం వద్ద 7వ రోజున నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు.

ఎస్టీపీపీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

జైపూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీ గిరిజన ఉద్యోగుల సంక్షేమం సంఘం కమిటీని మంగళవారం ఎస్టీపీపీలో ఎన్నుకున్నట్లు సెంట్రల్ ప్రెసిడెంట్ పంతుల పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడిగా బానోత్ తిరుమల్, ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా దేవేందర్ సింగ్, గౌరవాధ్యక్షులుగా కిరణ్‌బాబు, జనరల్ సెక్రటరీగా అజ్మీర మోహన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని కలిసి ప్లాంట్‌లో సమస్యలను వివరించారు. ఎస్టీ లైజన్ అధికారి వెంకటయ్య, చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సురేష్, టీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.


అన్నప్రసాద వితరణ



అన్నదానం ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

హాజీపూర్, సెప్టెంబర్2 (ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమాండెంట్ వెంకట రాములు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కమాండెంట్ దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణేస్ ఉత్సవ కమిటీ సభ్యులు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సహకార'లో ఉత్కంఠ



- పదవీకాలం పొడిగించినా.. కొనసాగింపుపై సందిగ్ధం
- పనితీరు సక్రమంగా ఉంటేనే అనుమతి
- నిబంధనలు విధించిన ప్రభుత్వం

ఆసిఫాబాద్‌రూరల్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌) పాలకవర్గాల గడువు గత నెల 14వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో పదవీ కాలం మరో ఆరుమాసాల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ నిబంధనల ప్రకారం ఉన్న సొసైటీలకు మాత్రమే వర్తిస్తుందని మెలిక పెట్టింది. ఈ మేరకు పది అంశాలను నిర్దేశిస్తూ పనితీరు పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. పదవీకాలం పొడిగింపుపై హర్షం వ్యక్తం చేసిన చైర్మన్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలతో డీలా పడిపోయారు.

ప్రభుత్వ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సొసైటీల వివరాలు సేకరించే పనిలో నిమగ్న మయ్యారు. జిల్లాలో 12 సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సహకార సంఘాల పరిధిలో 25వేలకు పైగా సభ్యత్వం కలిగిన రైతులు ఉన్నారు.

అన్నదాతకు అండగా...

మండల స్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు అందజేస్తూ సొసైటీలు వారికి అండగా నిలుస్తున్నాయి. ఇలాంటి వాటికి ప్రతి ఐదేళ్లకొకసారి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుంది. సొసైటీ పరిధిలోని రైతులు, డైరెక్టర్లు, చైర్మన్లతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. 2020లో ఎన్నికైన పాలకవర్గం గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అయితే రాష్ట్రంలోని డీ సీసీబీ చైర్మన్లు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి విజ్ఞప్తి చేయడంతో పదవీకాలం ఆరు మాసాల పాటు పొడిగించింది. ఈ గడువు గతనెల 14తో ముగియ డంతో మరో ఆరు మాసాల పాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి సారి ఎలాంటి నిబంధనలు లేకుండా పదవీకాలం పొడిగించిన ప్రభుత్వం ఈసారి మాత్రం నిబంధనల ప్రకారం ఉన్న వాటికి మాత్రమే వర్తింప చేయాలనే నిబం, దన విధించడంతో సొసైటీల కొనసాగింపు సందేహంగా మారింది.

తాజా నిబంధనల ప్రకారం..

తాజా నిబంధనల ప్రకారం పనితీరు మెరుగ్గా ఉంటేనే వాటి పాలకవర్గాల గడువు పొడిగింపు ఉం టుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందు కోసం సొసైటీల వారీగా పది అంశాలతో కూడిన సమా చారం అందించాల్సిందిగా జిల్లా సహకారశా ఖను ఆదేశించింది. సొసైటీ పరిధిలో పాత బకా యిల పరిస్థితి రుణాల తిరిగి చెల్లింపులు సక్ర మంగా ఉన్నాయా, నిధుల దుర్విని యోగం ఏమైనా జరి గిందా జరిగితే వాటిపై ఎలాంటి విచారణ చేప ట్టారు దుర్విని యోగానికి పాల్పడిన వారిపై చట్టప రంగా ఏమైనా చర్యలు తీసుకున్నారా సొసైటీ కార్య కలాపాలపై ఆడిట్‌ చేశారా చట్టపర మైన చర్య లు తీసుకున్నారా తదితర అంశాలను తీసుకున్నారు.

చైర్మన్ల అయోమయం..

కాగా ప్రభుత్వ కొత్త నిబంధనలతో సొసైటీ చైర్మన్లలో ఆయోమయం నెలకొంది. వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం గత 15 రోజుల క్రితం ప్రకటించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగిస్తామని ఆగస్టు 13న వ్యవసాయశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. సంఘాల నిర్వహణ సక్రమంగా ఉన్న వాటినే కొన సాగించాలని లేనిచోట ప్రత్యేకాధికారులను నియమిస్తామని మెలిక పెట్టడంతో ఆయా సంఘాల చైర్మన్లు అయోమయానికి గురవుతున్నారు. పీఏసీ ఎస్‌ పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసి పోగా ఆరు మాసాలు గడువు పెంచారు. మరోసారి పెంపు కోసం పాలకవర్గాల పాత్రపై పది అంశా లతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని సహకార బ్యాంకు అధికారులను ఆదేశించినట్లు సమాచారం. చైర్మన్లు, పాలకవర్గాల సమావేశాలు, రైతులతో మమేకం, రుణాల మంజూరు, వసూలు, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలతో పా టు అవినీతి ఆరోప ణల వివరాలతో కమిషనరేట్‌ కార్యాలయం నివేదిక తెప్పించుకునే క్రమంలో జాప్యమవుతు న్నాట్లు తెలుస్తోంది. చైర్మన్లు అందు బాటులో లేకపోవడం మొక్కుబడిగా కార్యకలాపాలు, రికవరీ లేకపోవడం, రుణ మంజూరులో అవకతవకలు ఉన్నచోట ప్రత్యేక అధికారులను నియమించనుంది. దీంతో పాలకవర్గంలో ఆందోళన నెలకొంది.

నివేదికలు పంపించాం..

- రాథోడ్‌ బిక్కునాయక్‌, జిల్లా సహకార అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు పది అంశాలతో కూడిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానున్నాయి. తదుపరి ఆదేశాలకనుగుణంగా పొడి గింపుపై తగు చర్యలు తీసుకుంటాం.

వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

ఆసిఫాబాద్‌రూరల్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు వట్టివాగు, కుమరంభీం ప్రాజెక్టులలోకి వరదనీరు చేరడంతో మంగళవారం అధికారులు గేట్లు ఎత్తి కిందకు వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 239.5 మీటర్లకు గాను ప్రస్తుతం 238.500 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 3,000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో రెండు గేట్లు పైకి ఎత్తి 3,800 క్యూసెక్కుల వరదనీరు బయటకు వదులుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 243 మీటర్లకు గాను ప్రస్తుతం 237.50 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 13,681 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో నాలుగు గేట్లు పైకి ఎత్తి 12,369 క్యూసెక్కుల వరద నీటిని బయటకు వదులుతున్నారు. పెద్దవాగు నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

బెజ్జూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఫైనల్‌ ఓటరు లిస్టు పబ్లికేషన్‌, ఫైనల్‌ పోలింగ్‌ స్టేషన్‌ వివరాలను మంగళవారం మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీవో కార్యాలయంలో ప్రదర్శించామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో గౌరి శంకర్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ మూసా సోహెల్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, పిల్లల రక్షణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్‌ పాటిల్‌

ఆసిఫాబాద్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్న పిల్లల రక్షణే పోలీసు శాఖ తొలి ప్రధాన్యం ఇస్తుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్‌ పాటిల్‌ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, యువతులు హింసకు గురైనట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం షీ టీం, యాంటీ ఉమెన్‌ ట్రాఫికింగ్‌ టీం, భరోసా సెంటర్లు పని చేస్తున్నా యన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడోద్దని అన్నారు. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్‌, ఈవ్‌ టీజింగ్‌, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్‌ ట్రాఫికింగ్‌పై, భరోసా టీంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో హింసకు గురైనట్లయితే షీ టీంను సంప్రదించాలని సూచించారు. షీ టీం ద్వా రా 83 హట్‌స్పాట్‌ ప్రదేశాలు గుర్తించామని తెలిపారు. 25 అవ గాహన ప్రోగ్రాంల ద్వారా అవగాహన కల్పించి 8 మందిని రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. 11 ఫిర్యాదుల్లో మూడు ఎఫ్‌ఐఆర్‌, 8 కేసులలో కౌన్సెలింగ్‌ ఇచ్చామని ఎస్పీ తెలిపారు.

బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించిన ఎస్సై



పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించిన ఎస్సై రామకృష్ణ

సిర్పూర్‌(యు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోహినూర్‌ గ్రామానికి చెందిన బడి మానేసిన ఇద్దరు ఆదివాసీ పిల్లలను జైనూర్‌ మండలంలోని మర్లవాయి ఆశ్రమోన్నత పాఠశాలలో సిర్పూర్‌(యు) ఎస్సై రామకృష్ణ మంగళవారం చేర్పించారు. ఎస్సై రామకృష్ణా కోహినూర్‌ గ్రామానికి వెళుతుండగా ఇద్దరు పిల్లలు రోడ్డుపై ఆడుతూ కనిపించారు. దీంతో ఆయన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బడి మానేసిన పిల్లలుగా గుర్తించారు. దీంతో వారిని తన వాహనంలో తీసుకుని జైనూర్‌ మండలంలోని మర్లవాయి ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్య పొందితేనే గ్రామం, సమాజం, కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం అందరి బాధ్యత అని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

జైనూర్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆసిఫాబాద్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ సోషల్‌ మీడియా ఇన్‌చార్జి షేక్‌ ఫజల్‌ అన్నారు. స్థానిక మార్కెట్‌ కమిటీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఆసిఫాబాద్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ సోషల్‌ మీడియా ఇన్‌చార్జి షేక్‌ ఫజల్‌ను మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కుడిమెత విశ్వనాథ్‌, పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ మకీద్‌ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెందూర్‌ ప్రకాష్‌, మాజీ కోఆప్షన్‌ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్‌, సీనియర్‌ నాయకులు మేస్రాం అంబాజీ, షేక్‌ జమీల్‌, కనక గంగారాం, ధైలత్‌రావ్‌, రహీం, వసీం, మడావి క్రిష్ణ, షేక్‌ అబ్బు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

సిర్పూర్‌(యు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మండల పరిధిలో ఒక మహిళపై అత్యాచారాయత్నం, హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడికి ఇటీవల కోర్టు శిక్ష విధించడంతో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సిర్పూర్‌(యు), జైనూర్‌, లింగాపూర్‌ మండలాల నాయకులు ఎస్సై రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆత్రం భగవంత్‌రావు, రాజ్‌గోండ్‌ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు అనక దేవేందర్‌, ఆత్రం ఆనంద్‌రావు, మెస్రం మోతిరాం, మడావి శ్రీనివాస్‌, రాయి సెంటర్‌ సర్‌మెడీలు కుమ్ర దుందేరావు, ఆత్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచులు మెస్రం భూపతి, ఆత్రం మానిక్‌రావు, నాయకులు అమృత్‌రావు, లింబారావు, పకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

పంగిడిమాదరలో వైద్య శిబిరం

తిర్యాణి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో భాగంగా మంగళవారం పంగిడిమాదరలో వైద్య శిబిరం నిర్వహించామని ఎంపీడీవో మల్లేష్‌ అన్నారు. మండలంలోని పంగిడిమాదర గ్రామ పంచాయతీ పరిధిలో సీజనల్‌ వ్యాధులు నివారణ నిమిత్తం గ్రామపంచాయతీలో హాబిటేషన్లలో పారిశుధ్య నిర్వహణలో డ్రై కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవగాహన సదస్సులు

ఆసిఫాబాద్‌రూరల్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించామని జిల్లా సంక్షేమాధికారి భాస్కర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో వివిధ అంశాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు అమలు చేస్తున్న స్కీంలు, బేటీ బచావో, బేటీ పడావోతో పాటు నైపుణ్య అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు.

మల్టీపర్పస్‌ విధానం రద్దు చేయాలి

కెరమెరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్‌ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి జూనియర్‌ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్‌ విధానం ద్వారా కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే జీవో .51ని రద్దు చయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌, సిబ్బంది సంతోష్‌, రాజేష్‌, హీరాజీ, పాండు, బాలు, అనిల్‌, శ్రీకాంత్‌, జైవంత్‌ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌, (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ మల్టీపర్పస్‌ వర్కర్లు చేపడుతున్న నిరసన మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నది. రెండో రోజూ ఆసుపత్రి ఆవరణంలో ధర్నా చేపట్టారు. బీఆర్‌ఎస్‌ నాయకులు ధర్నాకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపెందర్‌ మాట్లాడుతూ ఐదు నెలలుగా పెండింగెలో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్‌ వర్కర్లు ఎలాంటి ఆర్డర్‌ కాపీలు లేకుండా పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాలా, నాయకులు అడె లక్కూనాయక్‌, మాజీ సర్పంచులు మడావి భీంరావ్‌, మేస్రాం రాహుల్‌, మాజీ డైరెక్టర్‌ గేడాం లక్ష్మణ్‌ వర్కర్లు దేవరావ్‌, మారుతి, శంకర్‌,సందీప్‌, రాహుల్‌, కళావతి, రంభ,ల లిత, సుజాత, రజనీకాంత్‌, పరమేశ్వర్‌, దినేష్‌ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో చింతలమానేపల్లి మండలంలో పని చేస్తున్న పంచాయతీ వర్కర్లు మంగళవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీ పర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన కార్మికులకు రూ.20 లక్షల ప్రమాద బీమా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు విలాస్‌, సంజీవ్‌, డి.విలాస్‌, గణేష్‌, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.



కెరమెరిలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కారోబార్లు

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, మల్టీ పర్పస్‌ విధనాన్ని రద్దు చేయాలని జీవో .51ని సవరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు వసంత్‌, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో కౌటాల మండలంలో పని చేస్తున్న పంచాయతీ వర్కర్లు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీ పర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన కార్మికులకు రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వర్కర్లు పాల్గొన్నారు.



బెజ్జూరులో ధర్నా చేస్తున్న కార్మికులు



జైనూర్‌లో ధర్నా చేస్తున్న మల్టీపర్పస్‌ వర్కర్లు

గణనాథులకు ప్రత్యేక పూజలు.. పలు చోట్ల అన్నదానాలు..



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్‌

ఆసిఫాబాద్‌రూరల్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ బాలాజీ వరప్రసాద్‌ అన్నారు. పట్టణంలోని పైకాజీగర్‌లోని శ్రీ విద్యాసాయి శివపార్వతి గణేశ్‌ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అరిగెల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. సరస్వతీ శిశు మందిర్‌లో సైతం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కర్జెల్లి గ్రామంలోని ఛత్రపతి శివాజీ గణేష్‌ మండలి వద్ద మహిళలు కుంకుమ పూజ కార్యక్రమం చేపట్టి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయా గణనాథుల వద్ద అన్నదాన కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): గోలేటిలో మంగళశారం గోలేటి పద్మశాలి వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్‌ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఎస్‌ఓ టు జీఎం కన్నం రాజమల్లు, ఏజీఎం కృష్ణమూర్తి, జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి దోమల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాట్నాపూర్‌, లేండిగూడ తదితర గ్రామాల్లో మంగళవారం గణేశ్‌ నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డప్పుచప్పుళ్లతో గణనాథులకు శోభాయాత్ర నిర్వహించి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌ పూసం హన్మంత్‌రావ్‌, సుదర్శన్‌, లేండిగూడ గణేష్‌యూత్‌ అధ్యక్షుడు ఆత్రం రాజు, సభ్యులు సిడాం శ్రీకాంత్‌, ఆత్రం ముత్త, గ్రామపటేల్‌ ఆత్రం భుజంగ్‌రావ్‌, ఆత్రం సూర్యరావ్‌, జుగునాక హిరామన్‌ గ్రామస్థులు పాల్గొన్నారు.

సిర్పూర్‌(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రెసిడేంట్‌గూడ, మహాదేవ్‌నగర్‌లలో మంగళవారం గణేష్‌ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. వారం రోజులుగా భక్తులు గణేశ్‌ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆత్రం భగవంత్‌రావు, మాజీ సర్పంచులు మెస్రం భూపతి, ఆర్క నాగోరావు,దుర్వా మోతిరాం, మెస్రం రాంచందర్‌, సేడ్మకి హీరమాన్‌, పుర్క అనిల్‌కుమార్‌, గేడం నాగోరావు, దుర్వ హన్ను పటేల్‌,ఆత్రం శ్రీరావ్‌, ఆత్రం బల్వంత్‌రావుపాల్గొన్నారు.



చింతలమానేపల్లిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



జైనూర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

బీజేపీ కార్యవర్గ సభ్యులకు సన్మానం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్‌, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పదాధికారులతో పాటు కార్యవర్గ సభ్యులకు మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌, వన్‌నేషన్‌ వన్‌ ఎలక్షన్‌ జిల్లా కన్వీనర్‌ నాగేశ్వర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, అరిగెల మల్లికార్జున్‌, విజయ్‌, కె విజయ్‌, ప్రహ్లాద్‌, వెంకన్న, వెంకటేష్‌, శరత్‌, గొల్ల, జయరాజ్‌, ప్రశాంత్‌, మురళీగౌడ్‌, నరేష్‌, దీపక్‌రావ్‌, వకీల్‌, సుజిత్‌, రమేష్‌, లక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

బెజ్జూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బెజ్జూరు, గొల్కొండ టీయూడబ్ల్యూఎస్‌ పాఠశాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట ఎంపీవో గౌరి శంకర్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ మూస సోయల్‌, ఎంఈవో సునీత, కార్యదర్శి వైకుంఠం తదతరులు ఉన్నారు.

హామీ అమలు చేయాలి

పెంచికలపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. స్థానికంగా మంగళవారం పలువురు మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్‌ చేశారు. అలాగే రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌, మొండి, రవి, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.